కూటమి వైఫల్యాలను ఎండగడదాం

- 'బాబు షూరిటీ.. మోసం గ్యారంటీ'లో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపు
- హామీలు నెరవేర్చకుండా ప్రజలను దగా చేస్తున్న చంద్రబాబు
- ఎక్కడా కానరాని అభివృద్ధి, సంక్షేమం
- ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై నానాటికీ పెరిగిపోతున్న వ్యతిరేకత



క్యూ ఆర్ కోడ్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను, ఎన్నికల హామీలను నెరవేర్చకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతగా దగా చేశారో ప్రజలకు చాటి చెప్పి ఎండగట్టాలని మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం పెద్దగొట్టిగల్లు సమీపంలోని ఒక కల్యాణ మండపంలో 'బాబు షూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. క్యూ ఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ, బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు హామీలు నెరవేర్చకుండా తమను మోసగించాడని, చేసిందేమీ లేదని ప్రజలు బాహాటంగానే మండిపడుతున్నారన్నారు. ఎప్పుడు అధికారంలో ఉన్నా రైతులను విస్మరించడం చంద్రబాబు నైజమని జిల్లాలో మామిడి రైతుల కడగండ్లను ఉదహరించారు. 'తల్లికి వందనం పథకం'లో విద్యార్థులకు రూ.13.200 కోట్ల నిధులు ఖర్చు చేయాల్సి ఉండగా కేవలం రూ.3వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసి విద్యార్థులను మోసం చేశారని ఆరోపించారు. తాము ఎప్పుడు అధికారంలో ఉన్న ప్రజాసేవ చేశామే గానీ దాడులు, దౌర్జన్యాలు, దందా చేయలేదన్నారు. తమ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో తాగునీటి ట్యాంకులు నిర్మించి దాహార్తి కష్టాలు తీర్చామన్నారు. జిల్లాలో పార్టీ నాయకులు, కార్యకర్తలపై కక్ష కట్టి కూటమి నేతలు చేస్తున్న దాడులు, దౌర్జన్యాలను సహించేది లేదని, వారికి అసలు, వడ్డీతో సహా రాబోవు రోజుల్లో చెల్లిస్తామని హెచ్చరించారు. కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. టీడీపీ నాయకులు గ్రామాల్లో అభివృద్ధి పనులకు అడ్డు పడకుండా సహకరించాలని హితవు పలికారు.

ఆడపడుచులను మోసం చేసిన బాబు: అనిషా రెడ్డి

అధికారం కోసం ఆడపడుచులను సీఎం చంద్రబాబు నాయుడు మోసం చేశారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నూతన కాల్వ అనిషారెడ్డి విమర్శించారు. ప్రతి మహిళకు నెలకు రూ.1500, ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం అని ఊదరగొట్టిన బాబు వాటి ఊసే ఎత్తడం లేదని దుయ్యబట్టారు. రైతాంగం సంక్షేమానికి తిలోదకాలు ఇచ్చారని, వరి, టమాట, దోస, మామిడి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, ఆ పంటల రైతులను ఆదుకున్న పాపానపోలేదన్నారు. మామిడి రైతుల కడగండ్లను తెలుసుకునేందుకు బంగారుపాళెంకు తమ పార్టీ అధినేత, మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి పర్యటనకు వస్తే కార్యకర్తలపై లాఠీచార్జి చేయడం, కేసులు బనాయించడం, రైతులను ఎల్లోమీడియా దండుపాళ్యం బ్యాచ్ అంటూ కారుకూతలు రాయడం హేయమని, దీనికి మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ప్రజలు మళ్లీ జగనన్న పాలననే కోరుకుంటున్నారన్నారు.



హాజరైన నాయకులు, కార్యకర్తలు



మాట్లాడుతున్న అనిషా రెడ్డి



రొంపిచెర్లలో పెద్దిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకులు

టీడీపీ నాయకుల చేరిక

వారాణాసివారిపల్లెకు చెందిన టీడీపీ నాయకులు పి.నాగరాజ, ఎం.మహేష్ వైఎస్సార్‌సీపీలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి సమక్షంలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పెద్దిరెడ్డి స్వాగతించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శులు నూతన కాల్వ అనిషారెడ్డి, పెద్దిరెడ్డి, సలీంబాషా, ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డిశ్వర్ రెడ్డి, పోకల అశోక్‌కుమార్, నాయకులు కరీముల్లా, కోటా వెంకటరమణ, ఎల్.మహబూబ్‌బాషా, అల్లాబక్ష్, గురు, బావాజి, ప్రేమానందం, రవీంద్ర, వెంకటరత్నం, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అభివృద్ధి పనులకు ఎంపీ నిధులు

సదుం: మండలంలో పలు అభివృద్ధి పనులకు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి నిధులు మంజూరు చేసినట్లు ఆయన కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. సదుం సీహెచ్‌సీలో మార్చురీ నిర్మాణానికి రూ. 13 లక్షలు, చింతపర్తివారిపల్లెలో సీసీ రోడ్డు వేయడానికి రూ.5 లక్షలు, సదుం దోబీ ఘాట్ వద్ద అదనపు గది నిర్మాణానికి రూ.5 లక్షలు, భట్టువారిపల్లె షాదీఖానాలో అదనపు గది నిర్మాణానికి రూ.4 లక్షలు మంజూరు చేసినట్లు తెలియజేశారు. అలాగే పులిచెర్ల మండలం కల్లూరులో ముస్లిం శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి రూ.3 లక్షలు, సోమల గంగమ్మ గుడి వీధిలో సీసీ రోడ్డు వేయడానికి రూ.3 లక్షలు, ఎంపీపీ పాఠశాల, అంగన్‌వాడీ ప్రహరీ నిర్మాణానికి రూ.3 లక్షలు మొత్తం రూ. 36 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలియజేసింది.

నల్లబ్యాడ్జీలతో ట్రాన్స్‌కో ఉద్యోగుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ట్రాన్స్‌కో జూనియర్ లైన్‌మెన్లు

పుంగనూరు: పట్టణంలోని ఏపీ ఎస్పీడీసీఎల్ కార్యాలయం ఎదుట సోమవారం ట్రాన్స్‌కో జూనియర్ లైన్‌మెన్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర అసోసియేషన్ పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్టు వారు తెలిపారు. పాత సర్వీసు రూల్స్ మేరకు జూనియర్ లైన్‌మెన్లకు అసిస్టెంట్ లైన్‌మెన్లుగా ఉద్యోగోన్నతి కల్పించి, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ముగ్గురు మహిళలపై దాడి

పుంగనూరు: మండలంలోని ఉలవలదిన్నికి చెందిన మంగమ్మ, ఆమె కుమార్తె సావిత్రి, కోడలు రాధపై అదే గ్రామానికి చెందిన గణేష్ సోమవారం దాడి చేశాడు. ఈ దాడిలో ముగ్గురు మహిళలు తీవ్రంగా గాయపడడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గాయపడిన మహిళలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

రోటరీక్లబ్ అధ్యక్షుడిగా గణేష్



పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న తరోటరీక్లబ్ అధ్యక్షుడు గణేష్, కార్యదర్శి రాజారెడ్డి

పుంగనూరు: పట్టణంలోని రోటరీక్లబ్ నూతన ప్రెసిడెంట్‌గా నానబాల గణేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. అలాగే కార్యదర్శిగా సీఎస్.రాజారెడ్డి, డైరెక్టర్లుగా డాక్టర్లు ప్రభాకర్, విజయకుమారి, శరణ్‌కుమార్, హరగోపాల్, పూలత్యాగరాజు, భాస్కర్‌జెట్టి, భాస్కర్, ఎస్‌విటి.కిషోర్, అనిల్, జాన్, నాగిరెడ్డి, సురేష్, ఆవుల హరిప్రసాద్, మునిరాజ, అర్షద్ అలి, వేణుగోపాల్‌రాజు, రవికిషోర్, కృష్ణకుమార్, సుధాకర్‌రెడ్డి, సత్యాచారి, ప్రవీణ్, శ్రీధర్‌ను ఎన్నుకున్నారు. రోటరీక్లబ్‌తో ప్రజలకు మరిన్ని సేవలు చేస్తామని నూతన కార్యవర్గం తెలిపింది.

శక్తి స్టీల్‌పై చర్యలు తీసుకోండి



కడా పీడీకి వినతి చేస్తున్న గ్రామస్తులు

కుప్పంరూరల్: నడుమూరు పంచాయతీలో ఉన్న శక్తి స్టీల్ ఫ్యాక్టరీ వల్ల పొలాల్లో పంటలు పండడం లేదని, జనం అనారోగ్యం బారిన పడుతున్నారని సోమవారం కడా ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్‌కు వినతిపత్రం ఇచ్చారు. 15 ఏళ్లుగా పరిశ్రమ నడుస్తోందని, దీని నుంచి వచ్చే పొగ వల్ల పంటలు సక్రమంగా పండడం లేదని, చివరకు పశుగ్రాసంపై కూడా పొగ కమ్ముకోవడంతో గ్రాసం తిన్న పశువులు మృత్యువాత పడుతున్నాయని నివేదించారు. అంతే కాకుండా దట్టమైన పొగ వల్ల వసనాడు గొల్లపల్లె, జోగిండ్లు, రామబదనూరు, పైపాళ్యం, నడుమూరు, వసనాడు, చిన్న వసనాడు, ములకలపల్లె, బోదగుట్టపల్లె, బిరుదనపల్లె గ్రామస్తులు తీవ్ర అనారోగ్యం బారిన పడుతున్నారని సమస్యలను ఏకరువు పెట్టారు. ఇకనైనా ఆ పరిశ్రమపై చర్యలు తీసుకుని ప్రజారోగ్యం కాపాడాలని కోరారు.

మూన్నాళ్ల ముచ్చటగా కొళాయిలు!



స్కూల్లో కొళాయిల నుంచి పోతున్న నీరు

చౌడేపల్లె: మండలంలోని వెంగళపల్లె ప్రాథమిక పాఠశాలలో తాగునీటి కొళాయిలు మూన్నాళ్ల ముచ్చటగా మిగిలాయి. నాడు–నేడు పథకం కింద విద్యార్థుల సౌకర్యార్థం ఈ కొళాయిలు ఏర్పాటు చేశారు. అయితే నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో కొళాయిలు విరిగి, నీరంతా వృథాగా పోతోంది. అధికారులు స్పందించి కొళాయిలను బాగు చేయించాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నోటీస్ బోర్డు

ఔత్సాహిక పారిశ్రామికేత్తలకు శిక్షణ

కుప్పం: యువ పారిశ్రామికవేత్తలకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు మంగళవారం 10 గంటలకు తమ కార్యాలయ ప్రాంగణంలో ప్రారంభిస్తున్నట్లు కడా కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. కొత్త వ్యాపారం ఎలా ప్రారంభించాలి..? ప్రభుత్వ సబ్సిడీ రుణాలు ఎలా పొందాలి? బ్యాంకుల ప్రాజెక్టు రిపోర్టు ఎలా తయారు చేయాలి? డిజిటల్ మార్కెటింగ్ ఎలా వినియోగించుకోవాలి? వ్యాపారలకు సరైన రూట్‌మ్యాప్ ఎలా రూపొందించుకోవాలి? అనే అంశాలపై ఈ శిక్షణ ఇస్తామని, దీనిని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలని కోరింది.

పాడి ఆవులు, దూడలకు ముందస్తు టీకాలు



టీకాలు వేస్తున్న పశు వైద్యాధికారి చంద్రశేఖర్

గుడుపల్లె: ముద్ద చర్మ వ్యాధి (లంపి స్కిన్) బారిన పడకుండా ఉండేందుకు ఆవులకు పశువైద్యాధికారి చంద్రశేఖర్ టీకాలను వేశారు. సోమవారం మండలంలోని కోటపల్లె లో 20 మంది రైతుల పాడి ఆవులకు ఈ టీకాలు వేశారు. మండలంలో ప్రతి గ్రామంలోనూ ఈ టీకాలు వేస్తామని, లంపి స్కిన్ వ్యాధి ఎక్కువగా చిన్న చిన్న దూడలకు వస్తుందన్నారు. దీంతో ముందు జాగ్రత్తగా టీకాలు వేస్తే ఈ వ్యాధి బారిన పడకుండా దూడలను కాపాడుకోవచ్చన్నారు. ఈ వ్యాధి వైరస్‌గా ప్రబలి ఆవులకు ఇబ్బంది పెడుతుందని చెప్పారు. పాడి ఆవులున్న రైతులు తప్పనిసరిగా ఈ టీకా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎట్టకేలకు రోడ్డు విస్తరణ పనులపై కదలిక



రోడ్డు విస్తరణ స్థలాలను పరిశీలిస్తున్న అధికారులు

కుప్పం: దశాబ్ద కాలంగా అర్ధాంతరంగా ఆగిన రోడ్డు విస్తరణ పనులపై అధికారులు ఆరా తీశారు. సోమవారం రైల్వే గేటు నుంచి పాతపేట, కొత్తపేట వరకు చేపట్టాల్సిన రోడ్డు విస్తరణ పనులపై సమీక్షించారు. ప్రధానంగా బస్టాండు ప్రాంగణంలోని మున్సిపాలిటీ అద్దె దుకాణాల సముదాయం, విస్తరణలో దుకాణాలు కోల్పోతున్న వారి వివరాల సేకరణకు పూనుకున్నారు. అలాగే, కొత్తపేట రోడ్డు విస్తరణ పనుల్లో బాధితులను ఆదుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. దీంతో పాటు పట్టణంలో ఇళ్ల స్థలాలను లేని నిరుపేదలకు స్థలాలు కేటాయించేందుకు చీలేపల్లె రెవెన్యూ గ్రామ లెక్కదాఖలాలో ఉన్న స్థలాలను పరిశీలించారు. త్వరలో రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

రెడ్డి అభ్యుదయ సంఘం నూతన కార్యవర్గం ఎంపిక



గంగవరం: పలమనేరు నియోజకవర్గ రెడ్డి అభ్యుదయ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం సోమవారం ఎంపికైంది. గంగవరం సమీపంలోని లయన్స్ క్లబ్‌లో రెడ్డి సంఘ సభ్యులు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జయరాంరెడ్డి, ఉపాధ్యక్షుడిగా రవిచంద్రారెడ్డి, జనరల్ సెక్రటరీగా వెంకటమునిరెడ్డి, జాయింట్ సెక్రటరీగా వేమారెడ్డి, కోశాధికారిగా ప్రతాప్‌రెడ్డి, పీఆర్‌ఓలుగా శీనురెడ్డి, మంజునాథ్‌రెడ్డి, సలహాదారులుగా కిషోర్‌గౌడు, అమరనాథ్‌రెడ్డి, మల్లీశ్వర్‌రెడ్డి తదితరులు ఎంపికైనట్టు తెలిపారు. రెడ్ల అభ్యున్నతికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని నూతన కార్యవర్గం తెలిపింది.

దాడులు చేసి మామీదే కేసులా?

- చిత్తూరు ఎస్పీని ఆశ్రయించిన బాధితులు



జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట ఫిర్యాదు పత్రాన్ని చూపుతున్న బాధితులు

గంగవరం: 'మాపైన దాడులు చేసిన వారిపై కేసులు కట్టకుండా బాధితులైన మామీదే పోలీస్ స్టేషన్‌లో కేసులు కడతారా.. ఇదేం న్యాయం' అంటూ గంగవరం మండలంలోని కలగటూరు గ్రామానికి చెందిన నాగరాజు, ఆయన భార్య నాగమణి సోమవారం చిత్తూరు ఎస్పీని ఆశ్రయించారు. తమకు న్యాయం చేయాలంటూ ఆయనకు విన్నవించారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. కలగటూరు గ్రామంలో పాల డెయిరీ నడుపుతున్న మునేంద్రకు చెందిన రూ.60వేల విలువ చేసే పాల నమూనాల యంత్రం ఈనెల 3న దొంగతనానికి గురైంది. దీనిపై పలమనేరు పోలీస్ స్టేషన్‌లో బాధితుడు మునేంద్ర ఫిర్యాదు చేశారు. అయితే గత 7వ తేదీన ఇదే గ్రామంలో ఉన్న బెల్ట్ షాప్‌లో మద్యం కొనుక్కున్న నాగరాజును గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ అనే వ్యక్తి ఇంటికి తీసుకెళ్లాడు. ఇద్దరూ కలిసి మద్యం సేవిస్తుండగా అదే ఇంట్లో దొంగతనానికి గురైన పాల యంత్రం అక్కడ కనిపించడంతో ఆ విషయాన్ని నాగరాజు ఫోన్ ద్వారా మునేంద్రకు సమాచారం ఇచ్చాడు. అంతలో అక్కడికి వెళ్లిన మునేంద్ర యంత్రం నువ్వే దొంగిలించావా..? అంటూ ఇద్దరూ ఘర్షణ పడ్డారు. అనంతరం మునేంద్ర పాల యంత్రాన్ని తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఆ కక్షతో నాగరాజు, అతని భార్య నాగమణిపైన లక్ష్మీనారాయణతో పాటు సర్పంచ్ కుటుంబీకులు దాడికి పాల్పడ్డారు. తమపై జరిగిన దాడులు గురించి బాధితులు గంగవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు తమపైనే తిరిగి కేసు కట్టారని వారు ఆవేదన చెందారు. తమ ఫిర్యాదును ఎంత మాత్రం స్వీకరించకపోవడంతో బాధితులు ఎస్పీని ఆశ్రయించారు. సర్పంచ్ కొడుకుల నుంచి తమకు రక్షణ కల్పించాలని విన్నవించారు. సర్పంచ్ కుటుంబీకులు తమమీదే దాడులు చేసి అధికార పార్టీ బలంతో కేసులు కట్టించారని వాపోయారు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే చర్యలు

పుంగనూరు: పట్టణంలో ఎక్కడైన ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తూ వాహనాలను పార్కింగ్ చేసినా, మితిమీరిన వేగంతో వెళ్లినా చర్యలు తప్పవని సీఐ సుబ్బరాయుడు హెచ్చరించారు. సోమవారం ఆయన పట్టణంలోని ఎంబీటీ రోడ్డు, గోకుల్ సర్కిల్, ఇందిరా సర్కిల్, నాగపాళెం, ఆర్టీసి బస్టాండ్ రోడ్డు, సెంటర్‌లాడ్జి ప్రాంతాలతో పాటు పీఎల్ఆర్ బైపాస్ రోడ్డులో ట్రాఫిక్‌ను పరిశీలించారు. విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో విచ్చలవిడిగా వాహనాలను ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేస్తున్నారని, అలాంటి వాహనాలపై కేసులు నమోదు చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తామని, అలాగే హారన్ల మోతతో ఫీట్లు చేస్తున్న మోటార్ సైక్లిస్టులను గుర్తించి, కేసులు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేస్తామన్నారు. మైనర్లు బైక్ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే వారి తల్లిదండ్రులపైన కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు.

కల్యాణం..కమనీయం



భట్టువారిపల్లెలో నిర్వహిస్తున్న ద్రౌపదీ కల్యాణోత్సవం

సదుం: మండలంలోని భట్టువారిపల్లెలో పెద్దిరెడ్డి భాస్కర్ రెడ్డి ట్రస్ట్ నిర్వహిస్తున్న మహాభారతయజ్ఞంలో భాగంగా సోమవారం ద్రౌపదీ కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. కంకణధారులైన బాబురెడ్డి, మల్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో పాండవులు, ద్రౌపదీ దేవి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల మంత్రోచ్చారణ, భక్తజన సందడి నడుమ మధ్య కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బోయకొండ ఆలయ మాజీ సభ్యుడు భాస్కర్ రెడ్డి, కృష్ణారెడ్డి, మోహన్‌రెడ్డి, చిన్నరమణ, రామాంజులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

పుంగనూరు: మండలంలోని ఈడిగపల్లెలో భాస్కర్ అనే వ్యక్తికి చెందిన ద్విచక్ర వాహనం ఆదివారం రాత్రి చోరీకి గురైంది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు సోమవారం పోలీసులు తెలిపారు. మదనపల్లె మండలం, జంగాలపల్లెకు చెందిన భాస్కర్ తన బంధువు ఈడిగపల్లెలో నివాసం ఉన్న శంకర ఇంటికి వచ్చి ఇంటి వద్ద వాహనం నిలిపాడు. ఆపై రాత్రి అక్కడే బస చేశాడు. ఉదయం లేచి చూడగా ద్విచక్ర వాహనం కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

వాట్సప్ గ్రూపు అడ్మిన్లు జాగ్రత్త

కుప్పం: వాట్సప్ గ్రూపుల అడ్మిన్లు జాగ్రత్తగా ఉండాలని డీఎస్పీ పార్థసారథి హెచ్చరించారు. సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. వాట్సప్‌లో అభ్యంతకరమైన మెస్సేజ్‌లు ఎవరు పోస్టు చేసినా దానికి బాధ్యుడు గ్రూపు అడ్మినే అవుతారని, దీనిపై కూడా గ్రూపు అడ్మిన్స్‌పై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మధ్య కాలంలో కుప్పం ప్రాంతంలో సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలు ఎక్కువగా చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, వీటిని వాట్సప్ అడ్మిన్లు కట్టడి చేయాలని కోరారు. ఈ మధ్య కాలంలో మహిళా కానిస్టేబుల్‌పై చేసిన ప్రచారం చాలా వైరల్ అయ్యిందని, దీనిపై అడ్మిన్‌ను మందలించినట్లు చెప్పారు. ప్రతి వాక్యాన్ని పరిశీలించాలని, మెస్సేజ్‌లు ఫార్వర్డ్ చేయడంపై కూడా ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

1ఎం 1బీతో కుప్పం ఇంజినీరింగ్ కళాశాల ఒప్పందం



1ఎం 1బీ సంస్థతో ఒప్పందం చేసుకుంటున్న కుప్పం ఇంజినీరింగ్ కళాశాల ప్రతినిధులు

కుప్పం రూరల్: ఐక్యరాజ్యసమితి గుర్తింపు పొందిన 1ఎం1బీ (వన్ మిలియన్ ఫర్ వన్ బిలియన్) అనే సంస్థతో తమ కళాశాల ఒప్పందం కుదుర్చుకున్నట్లు కుప్పం ఇంజినీరింగ్ కాలేజీ వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్‌రాజ్ తెలిపారు. ఈ సంస్థతో ఒప్పందంతో కళాశాల విద్యార్థులకు ఏఐ, గ్రీన్ స్కిల్, ఇతర కృత్రిమ మేధ కోర్సుల్లో కలిసి పని చేసే అవకాశం ఉందన్నారు. ఈ ఒప్పందంతో కుప్పం కళాశాల విద్యార్థులు ప్రపంచంలోని అనేక మందితో సమ్మిళితం కావడం, అనుభవాలు పంచుకోవడం వంటివి జరుగుతుందన్నారు. ముఖ్యంగా ఉద్యోగావకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో 1ఎం 1బీ ప్రతినిధులు దీపిక, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ బాబు, ప్లేస్‌మెంట్ సెల్ అధికారి జయకుమార్ ఉన్నారు.

'గురుకుల' ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

శాంతిపురం: కుప్పంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో ఉన్న ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ సరోజ తెలిపారు. ఇంగ్లిష్ మీడియంలో 5, 8 తరగతుల్లో మిగులు సీట్లు ఉన్నాయని, వీటి భర్తీ నిమిత్తం ఈ నెల 20న ఉదయం 10:30 నుంచి ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఆసక్తి కలవారు స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కాపీ, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోతో 18వ తేదీలోపు తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 7680845898 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

ఐటీఐ అడ్మిషన్ల గడువు పొడిగింపు

శాంతిపురం: స్థానిక ఐటీఐలోఅడ్మిషన్ల గడువును ఈ నెల 23 వరకూ పొడిగించినట్టు ప్రిన్సిపాల్ శేషారెడ్డి తెలిపారు. రెండవ దశ అడ్మిషన్లకు సవరించిన షెడ్యూలు ప్రకారం ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 20వ తేదీ వరకూ ఆన్‌లైనులో దరఖాస్తు చేసుకుని 22వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట లోపు సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకోవాలన్నారు. ఆ తర్వాత 23న నిర్వహించే కౌన్సెలింగ్‌లో సీట్లు కేటాయించనున్నట్టు తెలియజేశారు.

నేడు డయల్ యువర్ డీఎం

గంగవరం: పలమనేరు ఆర్టీసీ డిపో వద్ద మంగళవారం ఉదయం 11 నుంచి గంట పాటు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్టు డిపో మేనేజర్ టీకే.స్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని ప్రయాణికుల రవాణా సమస్యలు, ఇబ్బందులను సెల్ నంబర్: 9959225678కి ఫోన్ చేసి తమ దృష్టికి తేవాలని కోరారు.

పలమనేరు పట్టణ సమస్యలు పరిష్కరించరూ!

- మున్సిపల్ కమిషనర్‌కు పీపీఎస్ సభ్యుల వినతి

గంగవరం: పలమనేరులో పలు సమస్యలను పరిష్కరించాలని పలమనేరు పరిరక్షణ సమితి(పీపీఎస్) సభ్యులు సోమవారం మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. గుడియాత్తం రోడ్డుతో పాటు ఎంబీటీ రోడ్డు సర్కిల్ వద్ద దెబ్బతిన్న మురుగు కాలువలకు మరమ్మతులు చేయకపోవడంతో మురుగునీరు రోడ్డుమీదకు చేరి దుర్గంధం చిమ్ముతోందని, ఈ సమస్యను పలుసార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యను పరిష్కరించలేదన్నారు. అలాగే, పలువురు వ్యాపారులు రోడ్డు ఇరువైపులా అక్రమంగా బంకులు ఏర్పాటు చేయడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని..ఈ సమస్య ఉన్న ప్రాంతాల గురించి కమిషనర్‌కు తెలియజేశారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.

మా భూములు మాకు అప్పగించండి సారూ..!

- రెవెన్యూ శాఖ తప్పిదంతో 'తల్లికి వందనం' కట్
- తహసీల్దార్‌కు బాధిత కుటుంబం నివేదన'



తహసీల్దార్ కార్యాలయానికి తమ పిల్లలతో వచ్చిన సుబ్రమణ్యం దంపతులు

శాంతిపురం: రెవెన్యూ రికార్డులలో తమ భూములను తమ పేరిట చూపి, వాటిని అప్పగించాలని ఓ కుటుంబం రెవెన్యూ అధికారులను కోరింది. సోమవారం తహసీల్దార్ శివయ్యను కలిసి తమ గోడు నివేదించింది. వివరాలు.. చిన్నారిదొడ్డి పంచాయతీ కొత్తపేటకు చెందిన సుబ్రమణ్యం, పావని దంపతులకు ముగ్గురు సంతానం. రాళ్లబూదుగూరు జెడ్పీ హైస్కూల్లో కుమారులు ఈశ్వర్ 10వ తరగతి, గజేంద్ర 6, కుమార్తె రూప 8వ తరగతి చదువుతున్నారు. వీరికి సంబంధించి 'తల్లికి వందనం' సొమ్ము వీరి ఖాతాలో జమ కాలేదు. దీనిపై న్యాయం చేయాలని గ్రామ సచివాలయం, ఎంఈఓ, ఎంపీడీఓ కార్యాలయాల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయిందని సుబ్రమణ్యం చెప్పాడు. పదవ తరగతి చదువున్న తన కుమారుడు ఈశ్వర్ పేరిట రెవెన్యూ రికార్డుల్లో 5.44 ఎకరాలు, తన పేరిట 5.86 ఎకరాలు ఉందని తేలిందన్నారు. కానీ వాస్తవానికి తనకు 3 ఎకరాల్లోపు భూమి ఉంటే తన కుమారుడి పేరిట ఎలాంటి భూములు లేవని చెప్పారు. రెవెన్యూ శాఖ సిబ్బంది ఆన్‌లైన్‌లో తప్పుగా వివరాలు నమోదు చేయడంతో ముగ్గురు పిల్లలకు తల్లికి వందనం అందకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. అందుకే అధికారులు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, తమ భూములను సర్వే చేసి తమకు అప్పగించాలని కోరారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ మీ–సేవలో రెవెన్యూ రికార్డుల సవరణకు దరఖాస్తు చేసుకోవాలని వారికి సూచించారు.